# రేపటి హీ(జీ)రోలు

-పి.వి.రమణకుమార్

"ఒరేయ్ గిరీ! నువ్వు బస్‌స్టేషన్‌లో దిగీ దిగగానే మీ బావ హరి సెల్‌కి ఫోన్ చేయ్" పదహారోసారి చెప్పాడు సుబ్బరామయ్య.

హైదరాబాద్ వెళ్లే హైటెక్ బస్‌లో సీటు చూసుకుని బ్యాగు సర్దుకుంటూ విసవిసా చూసాడు గిరిబాబు. కండక్టర్ రిజర్వేషన్ చార్టు చూసుకుంటున్నాడు. చూపు సరిగ్గా ఆనని సుబ్బరామయ్య సరాసరి వెళ్లి కండక్టర్‌ని గుద్దుకున్నాడు. గయ్‌మన్నాడు కండక్టర్.

"ఏమయ్యా! కాస్త చూసుకుని రావద్దు" అన్నాడు కండక్టర్.

"శుక్లాలు బాగా ముదిరితేగానీ తీయనన్నాడు డాక్టర్"

"నీ శుక్లాలు తగలెయ్య. నా కీళ్ళు ఊడిపోయేలా గుద్దావ్. రిజర్వేషన్ ఉందా?" మింగేసేలా చూస్తూ అడిగాడు కండక్టర్.

సుబ్బరామయ్య చూపుడువేలుతో గిరిబాబుని చూపిస్తూ "వాడు నా మేనల్లుడు. బొత్తిగా అమాయకుడు" అన్నాడు.

"నోట్లో సిగరెట్ పెడితే కాలుస్తాడా లేదా?" అడిగాడు కండక్టర్.

"బీడీ పెట్టినా, చుట్ట పెట్టినా కక్కుకుంటాడే గానీ కాల్చలేడు" అన్నాడు.

"అయితే అమాయకుడే" తేల్చేసాడు కండక్టర్.

"మావాడు హైదరాబాద్ వెళ్లడం ఇదే మొదటిసారి" సుబ్బరామయ్య చెప్పగానే బస్‌లోని ఆడవాళ్లతోసహా అందరి చూపులు గిరిబాబువైపు ప్రసరించాయి. గిరిబాబు స్కామ్‌లో చిక్కి టీవీలో ఫోకస్ అయినవాడిలా తల వేలాడేసాడు.

"మీకేం భయంలేదు. మీ మేనల్లుడిని క్షేమంగా హైదరాబాద్‌లో దించుతాం" విసుగ్గా చెప్పాడు కండక్టర్.

"కాస్త నేను చెప్పేది వినండి. నాకో కొడుకున్నాడు. వాడి పేరు హరి. హీరో కావాలని హైదరాబాద్‌లో రెండు సంవత్సరాలనుంచి ప్రయత్నిస్తున్నాడు. చిన్నాచితకా కనిపించీ కనిపించని వేషాలే దొరుకుతున్నాయి. వాడి దగ్గరకు వీడిని పంపిస్తున్నాను. వీడేమో వయసు పెరిగినా మనసు పెరగని పసివాడు" సుబ్బరామయ్య బస్సు గుద్దీ మరీ చెబుతున్న ఆ నటుడు హరిబాబు ఎవరో ఆ బస్‌లో ఉన్నవాళ్లెవ్వరికీ గుర్తుకురాలేదు. ఇంతలో డ్రైవరు తన సీట్లో కూర్చుని ఇంజన్ స్టార్ట్ చేసాడు.

"మామయ్యా... దిగు...దిగు..." వెర్రికేకలు పెట్టాడు గిరిబాబు. ఆ కేకలు జురాసిక్ పార్కు సినిమాలోని రాక్షస జంతువు అరుపుల్లా వికృతంగా వినిపించాయి. జడుసుకున్న డ్రైవరు బస్ ఇంజన్ ఆఫ్ చేసి భయంతో బిక్కుబిక్కుమని చూడసాగాడు. కండక్టర్ కలుగజేసుకుని "ఏమయ్యా చెప్పిందే చెప్పి టీవీ సీరియల్లా చావ కొట్టకుండా దిగవయ్యా. బస్సు బయలుదేరాలి" అన్నాడు బుసలుకొడుతూ.

"భలేవాడివే. మా కుర్రాడికి కొత్త కాబట్టి జాగ్రత్తలు చెబుతున్నాను. ఒరేయ్ గిరీ! నువ్వు నేను వ్రాసిచ్చిన చీటీ హరికివ్వడం మరిచిపోకు. నువ్వసలే అమాయకపు వెధవ్వి. ఇదిగో కండక్టర్ తప్పుకో" అంటూ ముందుకు నెట్టుకొచ్చాడు సుబ్బరామయ్య.

సుబ్బరామయ్య దిగగానే "రైట్" చెప్పాడు కండక్టర్. బస్సు కదిలింది. ప్లాట్‌ఫాం మీద గిరికి కనుమరుగయ్యేదాకా చేయి ఊపుతూనే ఉన్నాడు సుబ్బరామయ్య.

"నువ్వు తిరిగొచ్చేదాకా బస్టాండులోనే ఉండేట్లున్నాడు పాపం. పెద్దాయనకు ఎంత ప్రేమ?" ఆశ్చర్యపోతూ అన్నాడు కండక్టర్.

"ప్రేమా దోమా... అంతా డ్రామా. ముసలి వెధవ. వాడి కొడుకైతేనేమో పెద్ద హీరో అయిపోవాలి. నేనేమో పనికిమాలినవాడినైపోవాలి. పుట్టినప్పటినుండీ కుట్ర" అంటూ చెబుతున్న గిరిబాబు మాటలకు బోల్డంత ఆశ్చర్యపోయాడు కండక్టర్.

***

అర్ధరాత్రి దాటాక బస్సు నల్గొండలో ఆగింది. కొద్దిమంది మగవాళ్ళు మాత్రం దిగి టీలు తాగుతున్నారు. గిరిబాబు కూడా దిగి డ్రైవర్, కండక్టర్‌తో పాటు షర్టు లోపల భద్రంగా దాచుకున్న సిగరెట్ పాకెట్ తీసి చెరొక సిగరెట్ ఇచ్చాడు. కండక్టర్ బోలెడు ఆశ్చర్యంతో కళ్ల వెంట ఆనందభాష్పాలు రాల్చాడు.

"నోట్లో సిగరెట్ పెడితే కక్కుకుంటావేగానీ కాల్చలేవని మీ మామయ్యా చెప్పాడే" అన్నాడు.

"ఎవడూ? ఆ మిడిగుడ్ల రొయ్యమీసాల దేగా! దొంగనాయాలు. వాడు నన్ను అమాయకంగా పెంచాలనుకున్నా నేను రహస్యంగా లోకజ్ఞానమంతా నేర్చుకున్నాను. ఆ సంగతి వీడికి తెలీక అమాయకుడిలా పెంచాననుకుని సంబరపడిపోతుంటాడు. మా అమ్మానాన్నలు చిన్నప్పుడే పోయారు. ఉన్న ఆస్తి మా అమ్మకూ, వీడికీ చెరి సగం రాసి మా తాత పోయాడు. వీడేమో నేనంటే పెద్ద ప్రేమ ఉన్నవాడిలా బిల్డప్ ఇస్తూ కొడుకును హైదరాబాద్ పంపించి సినిమా హీరోలా చూడాలని వెండితెర కలలు కంటున్నాడు. వాడొట్టి వాజమ్మ. సంవత్సరం నుండి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇంతవరకూ ఒక్క సినిమాలో కూడా క్లోజప్ షాట్ పడలేదు" రింగులు రింగులుగా పొగ వదులుతూ వయసు తక్కువ వేదాంతిలా చెప్పాడు గిరిబాబు.

"అదన్నమాట ఫ్లాష్‌బ్యాక్" అన్నాడు కండక్టర్.

"అద్సరే కండక్టర్‌గారూ! మీరు సినిమాలు ఎక్కువగా చూస్తుంటారా?" అడిగాడు.

అంతలోనే డ్రైవరు తన సీట్లోకి వెళ్లి హారన్ మోగించడంతో ఇక ఆ సంభాషణకు ఫుల్‌స్టాప్ పెట్టేసి బస్సులోకి జంప్ చేసారు కండక్టర్, గిరిబాబు.

***

కాస్తంత కునుకు తీసి లేచేసరికి భాగ్యనగరం బస్‌స్టేషన్‌లో ఉన్నాడు గిరిబాబు. వచ్చీపోయే హారన్ల మోతలతో, టీ, పేపర్లు అమ్మేవాళ్ల అరుపులతో, ప్రయాణికులు చేసే హడావుడితో అక్కడ పోచమ్మతల్లి తిరునాల ప్రాంతంలా ఉంది. భుజాన బ్యాగ్ వేసుకుని గిరిబాబు కార్గిల్ వీరుడిలా ఫోజు కొడుతూ బస్సు దిగాడు. ఆ కొత్త ప్రపంచంలో స్వేచ్ఛగా సిగరెట్ పీలుస్తూ బస్టాండు అంతా తిరిగాడు. ఇన్నాళ్లూ ఓ చిన్న ఊళ్లో బైట ప్రపంచం అంటూ తెలీకుండా పెరిగాడు.

ఇంతలో "ఒరేయ్ గిరీ..గిరీ.." అంటూ కేకలు వేసుకుంటూ అంత దూరాన్నుండి ఆయాస పడి

పోతూ పరుగునవచ్చి తక్కున పట్టేసుకున్నాడు హరిబాబు.

"హరీ..."

"గిరీ..."

"దరిద్రుడా! నాన్న ఫోన్ చేయబట్టీ వచ్చాను. వచ్చిన వెంటనే సెల్‌కి ఫోన్ చేయవచ్చుగా?"

"కాసేపు స్వేచ్ఛగా తిరిగి తీరిగ్గా చేద్దామనుకున్నాను."

"ఇన్నాళ్లయినా నీ బుద్ధి మారలేదు బావా"

"ఎలా మారుతుంది బావా! మీ నాన్న నిన్ను హీరోగా చూడాలని, నన్ను జీరోగా చేయాలని కుట్ర పన్నడంలేదూ"

"అఘోరించావుగానీ పద" అంటూ బస్‌స్టేషన్ బైటకు తీసుకువచ్చి ఆటో ఎక్కించాడు హరిబాబు.

★★★

బిన్‌లాడెన్ తప్పించుకువచ్చి దాక్కున్నా కనిపెట్టలేనంత గజిబిజి కట్టడాలతో వున్న కృష్ణనగర్ ప్రక్క సందుల్లో ఉన్న ఒకానొక సందులో ఉంది హరిబాబు అద్దెకుంటున్న గది.

"బావా! మన ఊరిలో లంకంత కొంపలో ఉండేవాడివి. ఈ పిచ్చుకగూడులో ఎలా వుంటున్నావు?" బుర్ర గోక్కుంటూ అడిగాడు గిరిబాబు.

"ఇష్... చిన్నగా మాట్లాడు. మా ఇంటి ఓనరు ఓబులయ్య గేదెల వ్యాపారం చేసి ఇంత ఇల్లు కట్టాడు. చుట్టమొచ్చినా, స్నేహితుడొచ్చినా ఒక పూట మాత్రమే రూములో ఉండడానికి ఒప్పుకుం



టాడు'' చెప్పాడు హరిబాబు.

"గేదెల వ్యాపారం చేసి చేసి మానవత్వం హరించుకుపోయి పశుత్వం ఆవరించిందన్నమాట''

"అవును బావా'' కళ్లనీళ్లు తుడుచుకున్నాడు హరిబాబు.

"ఊరుకో బావా! హీరోలంటేనే కష్టాలపాలయ్యి ఆఖర్లో అనుకున్నవి సాధిం చేవాళ్ళు. హీరోగా నిలబడాలంటే ఈమాత్రం దిక్కుమాలిన బాధలు పడాల్సిందే. అయినా నీ పరిస్థితి అంచనావేసి పరిష్కార మార్గం ఆలోచించడానికేగా నేను వచ్చింది. డోంట్ వర్రీ'' అంటూ ఓదార్చాడు గిరిబాబు.

***

మర్నాడు ఉదయాన్నే లేచి తనే వెళ్లి కాఫీ, టిఫెన్లు తీసుకొచ్చి గిరికి అతిథి మర్యాదలు చేసాడు హరిబాబు. గిరిబాబు దర్జాగా ఫలహారాలు పూర్తిచేసి సిగరెట్ వెలిగిస్తూ హరిబాబుకి కూడా ఆఫర్ చేసాడు.

హరిబాబు తిరస్కరిస్తూ "బుద్ధవిగ్రహమంత బుద్ధిగా బ్రతుకుతున్నాను బావా'' అన్నాడు.

"నీ ముఖం చూసినప్పుడే అనుకున్నాను.''

"ఏమని?''

"విగ్రహంలా బ్రతుకీడుస్తూ అన్నీ నిగ్రహించుకుంటున్నావని'' రింగులుగా పొగ వదులుతూ చెప్పాడు గిరిబాబు.

"ఇది సినిమా ఫీల్డు నాయ్యనా! ఇక్కడ వ్యసనాలను అరిచేతుల్లో పెట్టుకోకపోతే హరిబాబు కాస్తా హరనాథ్ అవుతాడు''

"ఆ విషయం తేల్చడానికే మామయ్య నన్ను పంపించాడు. అసలీ రంగంలో నీ ప్రోగ్రెస్ ఏమిటి? నీ ప్రయత్నాలు ఎన్ని రీళ్లవరకు వచ్చాయి?'' సీరియస్‌గా ముఖం పెట్టి అడిగాడు గిరిబాబు.

ఆ ప్రశ్నలకు హరిబాబు ముఖం అట్టర్‌ఫ్లాప్ అయిన సినిమాలా మాడిపోయింది. గిరి అది గ్రహించి "అనుకున్నా... మొన్న టీవీ ఛానెల్స్‌లో అడిగితే అడ్డదిడ్డమైన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక చావు ఫీలింగ్ పెట్టినట్లున్న నీ ముఖం చూడగానే అనుకున్నా. సంవత్సరం ఆర్నెల్లుగా నువ్వు ప్రయత్నాలు చేసీ చేసీ ఆఖరికి గుంపులో గోవిందలాంటి పాత్రలు తప్ప క్లోజప్‌లో ఒక్క డైలాగ్ అయినా చెబుతూ కనిపించలేకపోయావుకదూ?'' బడి పిల్లాడిని అడిగినట్లు అడిగాడు గిరి. అప్పటివరకూ గుండెనిబ్బరంతో దుఃఖం తన్నుకొస్తున్న ఉప్పెనలా పైకి ఎగదన్నుకురాగా అమాంతం బాల్యస్నేహితుడు, బావా అయిన గిరిని కౌగలించుకుని బావురుమన్నాడు హరిబాబు. అలా చాలాసేపు గుక్కపట్టి ఏడ్చీ ఏడ్చీ గిరిబాబు భుజాలమీదే గుర్రుపెట్టి నిద్రపోయాడు.

"ఛ...ఛ... లే బావా... ఏంటిలా భుజంమీద చొంగ కారుస్తూ నిద్రపోయావు?'' చిరాకు పడుతూ లేపాడు గిరి.

"సారీ బావా! చాలారోజుల తరువాత గుండెలోని బాధంతా దింపుకున్నాను'' కళ్ళు నులుముకుంటూ చెప్పాడు హరి.

"ఇదిగో చొంగంతా దింపుకున్నావు. ఇన్నేళ్లు వచ్చినా నిద్రలో చొంగ కార్చే అలవాటు నీకు పోలేదు'' అని విసుగ్గా జేబులోంచి ఓ చీటీ తీసి ఇస్తూ "మీ నాన్న రాసిచ్చిన లెటర్. సెల్‌లో చెప్పాలంటే చాలా అవుతుందని రాశాడులే ముందు చదువు'' చెప్పాడు గిరి.

ఆదుర్దాగా దాన్ని అందుకుని చదవడం మొదలుపెట్టాడు హరి.

"ఒరేయ్ సన్నాసి వెధవ! ఇంకా ఎన్ని లక్షలు మింగుతావు? నువ్వు సినిమాల్లో పెద్ద హీరో అయ్యేసరికి నేను కాస్తా హరీమంటాను. ఇప్పటికి లక్ష రూపాయలు తగలేసావు. ఒక్క సినిమాలో కూడా నీ ముఖం స్పష్టంగా కనిపించి చావలేదు. రేపో మాపో ఏదో ఒక సినిమాలో హీరోగా బుక్ అయినట్లు కబురు చేయలేకపోయావో... ఇక నీ ప్రయత్నాలకు నీళ్ళు వదులుకుని గిరిగాడిని వెంటబెట్టుకుని నీ లగేజీతోసహా దిగి తగలడు. ఇక్కడే ఏదో ఒకటి చేసుకుని బతుకు. గంతకు తగ్గ బొంతను చూసి మూడుముళ్లు కట్టించేస్తాను. మిగతా విషయాలు ముఖాముఖి మాట్లాడుకుందాం.

ఇట్లు నీ తండ్రి

మీసాల సుబ్బరామయ్య వ్రాలు

చీటీ పూర్తిగా చదివి ఒక వేడి నిట్టూర్పు విడిచాడు హరిబాబు. ఆ తరువాత దీనంగా గిరి కళ్లల్లోకి చూసాడు. "ఈమధ్యనే జూనియర్ ఆర్టిస్టుగా పేరు తెచ్చుకుంటున్నాను బావా. రేపు మెగా డైరెక్టర్ ఇడ్లీ సోమనాథ్ శిష్యుడైన గంజి బాబు డైరెక్టు చేసే సినిమా షూటింగ్‌లో నటించాల్సి ఉంది. ఇలా ఉన్నఫళంగా వచ్చేయమనడం న్యాయంకాదు, ధర్మంకాదు.''

"గోంగూరకాదూ... అదిసరే గంజిబాబు అదేం పేరు?'' అడిగాడు గిరి.


"సినిమా ఫీల్డుకి వచ్చిన కొత్తల్లో గంజి తాగి బ్రతుకుతూ డైరెక్షన్ నేర్చుకున్నాడు. అసలు సినిమా డైరెక్షన్ చేయడం అంటే మాటలు కాదు. అదో నిరంతర తపస్సు.''

"కరెస్పాండెన్స్ కోర్సు.''



## పెర్ఫార్మెన్స్‌కే ప్రాధాన్యత

తెలుగులో మంచి తారగా పేరు తెచ్చుకున్న భూమిక గ్లామర్ కంటే పెర్ఫార్మెన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. మిగతా హీరోయిన్స్‌తో పోలిస్తే కురచ దుస్తులు, వెకిలిచేష్టలు ఆమెకు సరిపడవు. తమిళంలో ప్రస్తుతం బిజీగా ఉన్న ఈ భామ ఇకనుంచి కథల ఎంపిక విషయంలో, కాస్ట్యూమ్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానంటోంది.



"బావా"

"అవును బావా... మీ నాన్నకు తెలియకుండా డైరెక్షన్ శాఖ గురించి కరస్పాండెన్స్ ద్వారా కోర్సు చదివి, విపరీతంగా పాత, కొత్త సినిమాలు ఎడాపెడా చూసేసి నేర్చుకున్నాను. ఇంతెందుకు... ఓ మంచి ప్రొడ్యూసర్‌ని చూసుకో. నిన్నో 'పోకిరి'ని చేస్తాను. సారీ నీకో 'పోకిరి'లాంటి హిట్ ఇస్తాను'' చెప్పేసి సిగరెట్ వెలిగించాడు గిరి. హరి కళ్లకు గిరి గోవర్ధనగిరిని చిటికెనవేలితో ఎత్తి, అలసిపోయి సిగరెట్ తాగుతున్న చిలిపి కృష్ణుడిలా కనిపించాడు.

"బావా! రేపు మనం షూటింగ్ స్పాట్‌కు వెళదాం. అక్కడ నీకు కొంత షూటింగ్ గురించిన అవగాహన కలుగుతుంది'' అన్నాడు.

"ఇట్స్ ఓకే...'' అన్నాడు గిరి రిలాక్స్‌గా.

***

ఆ మర్నాడు ఇద్దరూ షూటింగ్ స్పాట్‌కు వెళ్లారు. అక్కడ దర్శకుడు గంజిబాబు, హీరో హీరోయిన్ల మధ్య లవ్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాడు.

హరిబాబుకి మేకప్ వేసి జూనియర్ ఆర్టిస్టులతో కలిపి కూర్చోబెట్టారు. దూరంగా సినిమా షూటింగ్ చూడడానికి వచ్చిన ప్రేక్షకులలో నిలబడి గిరిబాబు గమనించసాగాడు. అది పార్కులో హీరో హీరోయిన్‌లిద్దరూ కలుసుకునే సన్నివేశం. ప్రేమగా పరుగెత్తుకుంటూ చెరోవైపు నుండి వచ్చి ఒక చోట కలుసుకోవాలి. కొత్త హీరో, కొత్త హీరోయిన్ నవ్వితే ఏడ్చినట్లుండే ఫేసులతో ఆ సన్నివేశాన్ని రక్తి కట్టించలేకపోతున్నారు. దర్శకుడు గంజిబాబు జుట్టు పీక్కుంటూ కాస్సేపు గెడ్డం పీక్కుంటూ, కాస్సేపు ఆలోచిస్తూ కెమెరామెన్‌కి షాట్స్ వివరిస్తున్నాడు. ఆ చిత్రీకరణ చేస్తున్నవాళ్లకే కాదు, చూస్తున్నవాళ్లకు కూడా విసుగేస్తోంది. పార్కులో అక్కడక్కడ ఉండే ప్రజల్లో ఒకడిగా నటిస్తున్న హరిబాబు దగ్గరకు గిరిబాబు చకచకా వచ్చాడు.

"వీడి ముఖం ఇదేం డైరెక్షన్ బావా!'' అన్నాడు కాస్త గట్టిగా.

ఆ మాట ఆ యూనిట్ వాళ్లకే కాదు, అక్కడున్న అందరితోపాటు దర్శకుడైన గంజిబాబుకి కూడా స్పష్టంగా వినబడింది. సీరియస్‌గా వచ్చి పళ్లు పటపట కొరుకుతూ గిరిబాబు చొక్కా పట్టుకుని "ఎవడ్రా నువ్వు?'' అంటూ ఒక్క తోపు తోసాడు. చిర్రెత్తుకొచ్చిన గిరిబాబు తల ముందుకు వచ్చి పొటేలు కుమ్మినట్టు ఒక్క కుమ్ము కుమ్మాడు. గంజిబాబు, గిరిబాబులిద్దరూ కలబడుకుంటూ చొక్కాలు చించుకోసాగారు. యూనిట్‌లో సభ్యులు వచ్చి ఇద్దరినీ విడిపించారు.

షూటింగ్ స్పాట్‌కు వచ్చి తనను పొటేలు కుమ్మినట్లు కుమ్మిన వాడెవడో తెలుసుకుని అందుక్కారణమైన జూనియర్ ఆర్టిస్టు హరిబాబును కూడా గిరిబాబుతోపాటు స్టూడియో గేటు బయటకు నెట్టించాడు దర్శకుడు గంజిబాబు.

***

"ఛ... అంతా నీవల్లే జరిగింది. వాడి డైరక్షన్ ఎలా ఏడిస్తే మనకెందుకు? పార్కులో హీరోతో 'టైమెంత అయిందండీ?' అనే డైలాగున్న పాత్ర నాది. రాక రాక ఇన్నాళ్లకు ఒక గుర్తింపు వున్న పాత్ర వస్తే అంతా చెడగొట్టేసావ్. ఆ గంజిబాబు, అతని గురువు ఇడ్లీ సోమనాథ్ లిద్దరూ తమ పలుకుబడితో నాకింక ఎలాంటి వేషం రాకుండా చేస్తారు'' ఏడుపు ముఖం పెట్టి చెప్పాడు హరిబాబు.

గిరిబాబు శ్రీకృష్ణుడిలా చిద్విలాసంగా నవ్వి గీతలో బోధిస్తున్నట్లుగా ఫోజు పెట్టాడు. "బావా! పాత్ర వేసేవాడెవడు? వేయించేవాడెవడు? అన్నీ మనమే'' అన్నాడు.

"కాస్త అర్థమయ్యేట్టు చెప్పు బావా?'' బుర్ర గోక్కుంటూ అన్నాడు హరిబాబు.

"బావా! మనం మన ఊరెళ్తున్నాం. అక్కడి మన జాయింట్ పొలాలు కొన్ని అమ్మి ఆ డబ్బుతో తిరిగి హైదరాబాద్ వస్తాం. మీ నాన్న ప్రొడ్యూసర్. నేను డైరక్టర్‌ని. నువ్వు హీరోవి''

"బావా! నాన్న ఒప్పుకోవాలిగా?''

"ఒప్పుకుంటాడు. నువ్వు హీరో కావడం కోసమే బ్రతుకుతున్నాడు కాబట్టి చచ్చినట్లు ఒప్పుకుంటాడు. ఇద్దరం కలసి ఒప్పిస్తాం. నేటి చిత్ర పరిశ్రమలో ఎవరి సినిమాలు వాళ్ళే తీసుకోవాలి. ఒక విధంగా పోయేకాలం వచ్చినప్పుడు ఏ పరిశ్రమ అయినా ఈ స్థితికి చేరుకుంటున్నదన్నమాట. రేపటి హీరో కావాలంటే మీ సినిమా మీరే నిర్మించుకోవాలన్నమాట'' అంటూ చిత్ర గీతబోధ చేసాడు గిరిబాబు.

"బావా! నువ్వు నాపాలిట శ్రీకృష్ణ పరమాత్ముడివి. ఇక చూస్కో... అదరగొడతా'' అంటూ ఆనందంతో గిరిబాబును వాటేసుకున్నాడు హరిబాబు.

ఈ దెబ్బతో తాను డైరెక్టర్‌గా మారే ఛాన్స్ తప్పకుండా వస్తుందన్న ఆనందంతో తనలో తనే సంబరపడిపోయాడు గిరిబాబు.

★

## వేడెక్కిపోతున్న భూమి

గ్లోబల్ వార్మింగ్ వల్ల వచ్చే 10 ఏళ్లల్లో ప్రపంచ వాతావరణం తీవ్రంగా మారిపోతుందని శాస్త్రజ్ఞులు తమ భయాన్ని వెల్లడిస్తున్నారు. ప్రపంచమంతటా పరిశ్రమలు విడుదలచేసే కల్మషాల వల్ల ప్రతిచోటా 2-3 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగిపోతుందిట. భూ వాతావరణం సమూలంగా మారిపోవడానికిది ఈ వాతావరణం చాలట. ఆర్కిటెక్ ధృవం దగ్గరి మంచు విపరీతంగా కరిగి సముద్ర మట్టాలు పెరిగిపోతాయిట. ప్రపంచంలో అనేక దీవులు మునిగిపోయి వరదలు తుపానులు సంభవిస్తాయని, సృష్టిలో 50శాతం జీవులు పూర్తిగా చరిత్రలో కలిసిపోతాయని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

## వరదలో పాడుకాని వరి

కొన్నిరోజులు వరద నీటిలో మునిగి వరి పంట అంతా పాడైపోవడం ఏటా మనదేశంలో జరిగే విషయం. కానీ చాలారోజులు వరదలో మునిగినా పంటకేమీ కాని జన్యువు కలిగిన వరి విత్తనాల్ని ఫిలిప్పైన్స్‌లో అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ ఇటీవల ఉత్పత్తి చేసింది. ఈ విత్తనాలని విస్తృతంగా ఉపయోగించితే ప్రపంచంలో అనేక దేశాల్లో వరదల వల్ల కలిగే నష్టాన్ని అరికట్టవచ్చునంటున్నారు.

-విమలారామం

